తొండంగి ఎంపీడీవో సస్పెన్షన్ 7

'అన్నవరం'లో అభివృద్ధి పనులకు ఆమోదం

» రూ.70 లక్షలతో సీసీకెమెరాల రికార్డింగ్ సామర్థ్యం 90 రోజులకు పెంపుదల

లైంగిక వేధింపులు నిజమే

» జీజీహెచ్ విద్యార్థినులతో ల్యాబ్ టెక్నీషియన్ తరచూ అసభ్య ప్రవర్తన 7
» బూతులు తిడుతూ భుజాలు, నడుం,తొడలపై చేతులు వేస్తూ వేధింపులు
» బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీ నాన్‌టీచింగ్ స్టాఫ్ కూడా బాధితులే
» విద్యార్థినులను లైంగికంగా వేధించిన చక్రవర్తిపై విచారణ కమిటీ నివేదిక వెల్లడి
» 55మంది విద్యార్థినులు, 15టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ ఫిర్యాదులన్నీ నిజమే
» మరో ముగ్గురు సిబ్బంది కూడా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు
» లైంగిక వేధింపులపై ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌లో వచ్చిన కథనంపై సీఎం సీరియస్

ఆ నలుగురిపై సస్పెన్షన్ వేటు.. అరెస్టు

» వారిపై చట్టపరమైన చర్యలు
» ధైర్యంగా ఫిర్యాదు చేసిన విద్యార్థినులు, స్పందించిన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలకు అభినందనలు 7
» 'రంగరాయ' లైంగిక వేధింపుల ఘటనపై కాకినాడ జిల్లా కలెక్టర్

కొలి పులస వచ్చేసింది! 6

కొత్త కార్డులకు.. ఈకేవైసీ గుదిబండ! 6

» ఇది పూర్తి కాక పెండింగ్‌లోనే కొత్త రేషన్‌కార్డులు
» ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెండింగ్‌లో 23,720 దరఖాస్తులు



పైసల్ కొట్టు.. పోస్ట్ పట్టు!

» గ్రామ సర్వేయర్ల బదిలీల్లో పైరవీలు
» పోస్టును బట్టి రూ.50 వేల నుంచి 2 లక్షలు
» కావాల్సిన చోట పోస్టింగ్‌కు రూ.4 లక్షల రేటు
» ఎమ్మెల్యేల సిఫారసు లేఖలున్నా రూ.50 వేలు
» పెద్ద ఎత్తున చేతులు మారుతున్న ముడుపులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

గ్రామ సర్వేయర్ల బదిలీల్లో పెద్దఎత్తున ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీల పేరుతో కొందరు భారీగా దండుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ సర్వేయర్ల బదిలీ శుక్రవారం రాత్రి పూర్తయింది. మరికొన్ని గంటల్లో ఉత్తర్వులు అందనున్నాయి.ఏడీలు సిద్ధం చేసిన ఈ బదిలీల జాబితాలకు జిల్లా కలెక్టర్లు ఆమోదం తెలిపారు.అయితే అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి

పెద్దఎత్తున ముడుపులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కాకినాడలో 317, తూర్పుగోదావరి జిల్లాలో 150మంది, కోనసీమలో 271 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి 84మంది సర్వేయర్లకు స్థానచలనం కలగనుంది. ఈ బదిలీలకు సంబంధించి భారీ ఎత్తున పైరవీలు జరిగినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కావాల్సిన చోటుకు బదిలీ అయ్యేందుకు సర్వేయర్లు పెద్దఎత్తున ముడుపులు సమర్పించినట్టుగా సమాచారం. ప్రాంతాన్ని బట్టి రేటు నిర్ణయించినట్టుగా చెప్తున్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న పలువురికి ఈ బదిలీ ఉత్తర్వులు శనివారం అందజేయనున్నారు. పరస్పర బదిలీల కోసం కొందరు పైరవీలు సాగించారు. మరోవైపు ఈసారి ఈ సర్వేయర్ల బదిలీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలతో సర్వేయర్‌శాఖల ఉన్నతాధికారులపై ఒత్తిడి పెరిగింది. పెద్దఎత్తున వచ్చిన వీటితో ఎవరికి ఏస్థానం కల్పించాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకున్నారు. ముఖ్యంగా జిల్లాల కేంద్రాలకు చేరువలోఉన్న గ్రామాల్లోని స్థానాలకు పోటీ పెద్ద ఎత్తున నెలకొంది. పట్టణాలకు సమీపంలోఉన్న ప్రాంతాలపైనే కొందరు దృష్టిసారించారు. రియల్ ఎస్టేట్, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలపై కన్నేసిన సర్వేయర్లు ఆయా ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు ఆసక్తి చూపారు. దాని కోసం ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేసినట్టుగా చెబుతున్నారు. ఇక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా పనిచేసే సర్వేయర్లకు ఇష్టానుసారంగా సిఫారసు లేఖలు అందజేసినట్టు సమాచారం. కాకినాడ జిల్లాలోని కరప, కాకినాడ రూరల్, పిఠాపురం వంటి ప్రాంతాల్లో పనిచేసేలా పావులు కదిపినట్టుగా తెలుస్తోంది. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలోని అభివృద్ధి చెందుతున్న మండలాలు, గ్రామాల్లో పనిచేసేలా కొందరు ఆయా ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు.

ఎమ్మెల్యే సిఫారసు ఉన్నా..

వాస్తవానికి ఈ బదిలీల ప్రక్రియ కొన్నిరోజులుగా సాగుతోంది. తమకు అనుకూలమైన స్థానాల కోసం కొందరు ప్రత్యేక దృష్టిసారించారు. కాసులిచ్చుకో.. కావాల్సిన చోటు పట్టుకో అన్నట్టుగా వ్యవహారాన్ని నడిపించారు. పోస్టును బట్టి రూ.50వేల నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. కావాల్సిన చోట పోస్టింగ్ కోసం కొందరు రూ.నాలుగు లక్షల వరకు సమర్పించుకున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఉన్నా రూ.50వేల వరకు వసూలు చేశారని కొందరు చెబుతున్నారు.



వానోకాలం!

రుతుపవనాలు విస్తరించి చాలా వారాలు అవుతున్నా వీటి ప్రభావం ఈసీజన్‌లో పెద్దగా కనిపించడం లేదు. ఈపాటికే వర్షాలు ఎక్కడికక్కడ భారీగా కురవాల్సి ఉండగా చినుకుల జాడే కనిపించడం లేదు. పేరుకు ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవహించి భారీ కుండపోత వాన ఏక్షణమైనా కురుస్తుందన్నట్టు ఉంటున్నా తీరా గాలులు తప్పించి వాన జాడ ఉండడం లేదు. అటు దట్టమైన మేఘాల వలన వాతావరణం చల్లబడాల్సి ఉన్నా దీనికి భిన్నంగా ఎండలు దంచికొడుతు న్నాయి.ఫలితంగా వర్షపాతం ఆందోళన కలిగిస్తోంది. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

గతేడాది వద్దంటే వానలు..ఇప్పుడేమో..?



జూలైలో ఈ పది రోజులు పరిశీలిస్తే ఒకటి రెండు మండలాలు మినహా ఉమ్మడి జిల్లాలో అన్నీ లోటు వర్షపాతం కిందే రెడ్ మార్కులోకి వెళ్లిపోయాయి. సాధారణ వర్షపాతం కంటే తక్కువగానే సూచీలు హెచ్చరిస్తున్నాయి. గడచిన 40 రోజుల వర్షపాతం లెక్క లు పరిశీలిస్తే వర్షాభావం తీవ్రత చాటుతోంది. అనేక మండలాల్లో అసలు చినుకు జాడలేదు. జిల్లాల వారీ గా పరిశీలిస్తే గత నెల జూన్ 1 నుంచి ఈ నెల 10 వరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా సరాసరి వర్షపాతం 147.58 మి.మీ.లకు 160.48 మి.మీ. కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో 178.11 మి.మీలకు 192.28 మి.మీ. నమోదైంది. దీంతో ఈ రెండు జిల్లాలు సాధా రణ వర్షపాతం జాబితాలో కొనసాగుతున్నాయి. కోనసీమ జిల్లాలో 174.33 మి.మీలకు కేవలం 132.24 మి.మీ. కురిసింది. దీంతో జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. జిల్లాల సరాసరి వర్షపాతం సాధా రణంగా ఉండగా.. మండలాల వారీ పరిశీలిస్తే వర్షాభావ తీవ్రత కొంత ఆందోళనకు గురిచేస్తోంది. అదే సమయంలో కొన్ని మండలాల్లో ఏకంగా అదనపు వర్ష పాతం నమోదవడం విశేషం.

రుతుపవనాలు విస్తరించినా కానరాని వానలు

» ఉమ్మడి జిల్లాలో వర్షపాతం అరకొరే
» కాకినాడ,తూర్పున సాధారణం
» కోనసీమలో 15 మండలాల్లో లోటు
» గతేడాది జూన్‌లో భారీ వానలు
» ఈ ఏడాది చూస్తే కానరాని జాడ
» ఆందోళనలో రైతాంగం

ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ కరువైంది.. రుతు పవనాలు వచ్చేసినా వరుణుడి జాడ కానరావడం లేదు.. దట్టమైన మేఘాలు ఆవరించినా గాలులే తప్ప చుక్క చినుకు రాలడం లేదు.. ఈ పాటికే భారీ వర్షాలతో జిల్లాలో అదనపు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలు సాధారణ వర్షపాతంతోనే నెట్టుకొస్తున్నాయి. అటు కోనసీమ జిల్లా లోటు వర్షపాతంతో కలవరపాటుకు గురవుతోంది. గతేడాది ఈ పాటికే వానలు దంచి కొట్టాయి.ఈ సారి జూన్ నుంచి ఈ నెల జూలైలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాల్లేకపోవడం అన్నదాతలను కలవరపాటుకు గురిచేస్తోంది.

అప్పుడే నయం..

మే నెలలో కాకినాడ జిల్లా అంతా కలిపి 109.77 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 115.48 మి.మీ. నమో దైంది. జూన్‌నెలలో 96.57 మి.మీలకు 120.75 మి.మీ. నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో మేలో 78.56 మి.మీ.కు 136.54 కురవగా, జూన్‌లో 107.77 మి.మీకు 145.27 మి.మీ. కురిసింది. కోనసీమ జిల్లాలో మేలో 72.55 మి.మీకు 130.88 మి.మీ. కురవగా, జూన్‌లో 102.37 మి.మీ వర్షపాతానికి 108.25 మి.మీ కురిసింది. 2024లో జూన్ నెలలో కాకినాడ జిల్లాలో 112.8 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే .210.2 మి.మీ కురిసింది.. కోనసీమలో 111.4కి 175.3 మి.మీ నమోదైంది. తూర్పు గోదావరి జిల్లాలో 117.0కి 198.3 కురిసింది. గతేడాది జూలైలో కాకినాడ జిల్లా 198.0 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 223.8 మి.మీ. కురిసింది. కోనసీమలో 241కి 339.9 మి.మీ, తూర్పుగోదావరి జిల్లాలో 247.1కు 374.7 మి.మీ. కురిసింది. కానీ ఈ ఏడాది జూలైలో మాత్రం మొత్తం లోటు వర్షపాతం కొనసాగుతోంది.

కాకినాడలో లోటు

కాకినాడ జిల్లాలో మొత్తం 21 మండలాలకు 18 మండలాల్లో సాధారణ వర్షపాతమే కొనసాగుతోంది. మూడు మండలాల్లో అవ సరానికి మించిన వాన నమోదైంది. అం దులో గొల్లప్రోలు మం డలం జిల్లాలో అన్నింటికంటే అద నపు వర్షపాతంతో కొనసాగు తోంది.ఇక్కడ గడచిన 40 రోజుల్లో 66.17 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 106.11 మి.మీ. కురిసింది.కోట నందూరులో 103.07 మి.మీ.లకు 173.97 మి.మీ కురిసింది. తొండంగి మండలంలో 145.28 మి.మీకు 182.06 మి.మీ కురిసింది..అదే ఈ నెల పది రోజుల జిల్లా సరాసరి వర్షపాతం తీసుకుంటే 51.16 మి.మీ. కు రవాల్సి ఉంటే 39.71 మి.మీ కురిసి లోటు కొనసాగుతోంది.

తూర్పున ఇలా...

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 మండలాలకు 14 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా ఐదు మండలాల్లో మాత్రం అదనపు వర్షపాతం నమో దైంది.చాగల్లు మండలంలో గడచిన 40 రో జుల్లో 155.61 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 203.33, దేవరపల్లిలో 162.71కి 225.13, కొవ్వూరులో 166.3కు 213.56, నల్లజర్లలో 151.38కి 215.41, రాజమండ్రి అర్బ న్‌లో 173.64కి 208.69 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కోనసీమలో కలవరం..

కోనసీమ జిల్లాలో మొత్తం 22 మండలాలు ఉంటే ఏకంగా 15 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. గడచిన 40 రోజుల్లో అయినవిల్లి మండలంలో 188.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 123.14 మాత్రమే కురిసింది.అల్లవరం 182.85కు 131.51, అమలాపురం 187.65కు 128.54 మి.మీ,అంబాజీపేట 183.81కి 131.12, ఐ.పోలవరం 165.57కు 119.03, కాట్రేనికోన 177.89కి 120.36, మామిడికుదురు 181.27కి 134.3, ముమ్మిడివరం 188.42కి 120.72, పి.గన్నవరం 183.9కి 134.84,పామర్రు 156.26కి 119.78, రామచం ద్రపురం 153.69కి 120.7, రాయవరం 166.61కి 123.9, రాజోలు 191.98కి 139.97, సఖినేటిపల్లి 208.17కు 144.04,ఉప్పలగుప్తం 172.93కు 124.86 మి.మీ. వర్షపాతమే నమోదైంది.కోనసీమలోనే లోటు అధికంగా ఉంది.

లైంగిక వేధింపుల ఘటనపై మహిళా కమిషన్ ఆరా

కాకినాడక్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో చోటుచేసుకున్న లైంగిక వేధింపుల ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ శుక్రవారం ఆరా తీసింది. ఈ మేరకు ఆర్ఎంసీ అధికారులకు ఫోన్ చేసి ఘటన జరిగిన తీరును కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అడిగి తెలుసుకున్నారు. ముందు విచారణ జరిపిన ప్రక్రియపై ఆరా తీశారు. కళాశాల తరుపు నుంచి నిందితులపై చేపట్టిన చర్యలు ఏంటని ప్రశ్నించారు. బాధిత బాలికల కుటుంబాలకు అండగా ఉంటామని కమిషన్ తరపున హామీ ఇచ్చారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

జీజీహెచ్(కాకినాడ) జూలై 11 (ఆంధ్రజ్యోతి): బిడ్డకి, బిడ్డకి మధ్య తప్పనిసరిగా మూడేళ్ల ఎడం ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశానుసారం డీఎంహెచ్‌వో డాక్టర్ జె నరసింహనాయక్ ఆధ్వర్యంలో కాకినాడ నగరంలో నర్సింగ్ విద్యార్థినులు, వైద్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం అవసరం అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.డీఐవో డాక్టర్ కె.సుబ్బరాజు, డీఎల్‌టీవో పీవో డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ వి.అరుణ, డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ విల్సన్, డాక్టర్ రవి పాల్గొన్నారు.



ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో లెక్చరర్ పోస్టులకు పరీక్షలు: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ),జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 23 వరకు లెక్చరర్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కాకినాడలో ఎస్.అచ్చుతాపురం ఐయాన్ డిజిటల్ జోన్, రాయుడుపాలెంలో సాఫ్ట్ టెక్నాలజీ పరీక్షా కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలవద్ద నిరంతరం విద్యుత్తు సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు నిర్వహించే రోజున పరీక్ష కేంద్రాలకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు.

అతిసారం అత్యంత ప్రమాదకరం

» డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ),జూలై11(ఆంధ్రజ్యోతి): అతిసారం (డయేరియా) అత్యంత ప్రమాదకరమని నిర్లక్ష్యం చేస్తే ఒక్కోసారి మరణానికి దారి తీస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా ప్రచారంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అతిసార రహిత జిల్లాగా మార్చి పిల్లల మరణాలు 0కి చేర్చడమే అంతిమ లక్ష్యమన్నారు. ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన పిల్లలు ఉన్న ఇళ్లకు ఆశా ద్వారా ఓఆర్ఎస్, జింక్ కో-ప్యాకేజింగ్ పంపిణీ, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ల ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. అతిసారాన్ని నివారించాలంటే సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్యం, చేతులను సబ్బుతో కడగడం, తగిన పోషకాహారం తీసుకోవడం శ్రేయస్కరమన్నారు.



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కె.సుబ్బరాజు, డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ వి.అరుణ, డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ విల్సన్ పాల్గొన్నారు.

కాకినాడలో 100 ఆటోలు సీజ్

» ఎస్పీ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్

కాకినాడక్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను, విద్యార్థులను ఎక్కించడం, మితిమీరిన వేగంతో ఆటోలను నడుపుతున్న నేపథ్యంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో శుక్రవారం 100 ఆటోలను సీజ్ చేయడంతోపాటు ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజల భద్రత, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రయాణించే ఆటోల ధ్రువీకరణ పత్రాలు, వాహన భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల వివరాలు విధిగా వాహనంలో ఉంచుకోవాలన్నారు. అనుమతులు, భద్రతా ప్రమాణాలు సరిగాలేని 100 ఆటోలను గుర్తించి సీజ్ చేసి జరిమానాలు విధిస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు ఎస్పీ కౌన్సిలింగ్ ఇచ్చి నిబంధనలను ఉల్లంఘించకుండా విద్యార్థినులను, ప్రజలను వారి గమ్యస్థానాలకు చేర్చాలని అన్నారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ మనీష్‌దేవరాజ్, ట్రాఫిక్-1,2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ బిందుమాధవ్



కొత్త రేషన్‌కార్డులకు..
ఈకేవైసీ గుదిబండ!

కొత్తరేషన్‌కార్డులకు ఈకేవైసీ పెద్ద గుదిబండగా తయారైంది. సచివాలయంలో కొత్త రేషన్ కార్డుకోసం దరఖాస్తులను స్వీకరించిన తర్వాత ఈకేవైసీ పూర్తి చేస్తేనే విచారణలో అధికారులు ముందుకు వెళ్లగలరు. ఈకేవైసీ దగ్గరే రేషన్‌కార్డుల విచారణ నిలిచిపోతోంది. కొత్తకార్డులతో పాటు మార్పులు, చేర్పులకు కూడా ఇది పెను సవాల్‌గా మారింది.

- ఇది పూర్తి కాకపోవడంతో పెండింగ్‌లోనే కొత్త రేషన్‌కార్డులు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెండింగ్‌లో 23,720 దరఖాస్తులు
- రెండు నెలలుగా విచారణ దశలోనే ఆగిపోయిన వైనం
- కుటుంబంలో ఒకరి ఈకేవైసీ పెండింగ్‌గైనా నిలిచిపోతున్న కార్డులు
- కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

కలెక్టరేట్(కాకినాడ)-ఆంధ్రజ్యోతి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రేషన్‌కార్డులకోసం, మార్పులు, చేర్పులు, విభజనకోసం 1,46,860 దరఖాస్తులను స్వీకరించారు. దీనిలో 1,08,669 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. వీరికి వచ్చేనెలలో కొత్త రేషన్‌కార్డులు(స్మార్ట్ కార్డులు) ప్రభుత్వం అందజేయనుంది. ఈకేవైసీ పెండింగ్ నేపథ్యంలో 23,720 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. రేషన్‌కార్డు విభజన నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న మరో 14,471 దరఖాస్తులు కూడా పరిశీలనలో ఉన్నాయి. దీని వల్ల రేషన్‌కార్డుల మంజూరు క్రతువు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడంలేదు. దాదాపు రెండునెలలనుంచి కొత్తరేషన్‌కార్డుల కోసం సచివాలయాల్లో కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరిస్తున్నారుగానీ రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కొన్ని దరఖాస్తుల విచారణ నెల నుంచి నెలన్నర వరకు పట్టడంతో వాటికి మోక్షం కలగడంలేదు.

ఐదేళ్లు పూర్తిచేసుకుంటే ఆధార్ అప్‌డేట్

చిన్నారులు తీసుకున్న ఆధార్‌ను తమ వయస్సు ఐదేళ్లు పూర్తిచేసుకున్న తర్వాత తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలి. లేనిపక్షంలో ఈకేవైసీ నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో కొన్ని రేషన్‌కార్డుల విచారణ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతోంది. ఒక కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉంటే.. దానిలో నలుగురు ఈకేవైసీ పూర్తి చేసుకున్న తర్వాత ఒక అభ్యర్థికి పూర్తి కాకపోతే ఆ కార్డు విచారణ దశలోనే ఉండిపోతోంది. ఏదైనా ఉద్యోగం, ఉపాధి, చదువు నిమిత్తం కుటుంబంలో ఒక సభ్యుడు ఆయా గ్రామాలకు దూరంగా ఉంటే రేషన్‌కార్డు మంజూరుప్రక్రియ ఆగిపోతోంది.

పరిష్కారం కాని మ్యాపింగ్ సమస్యలు

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలంటే భార్యభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ అయి ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకోవడానికి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు.ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇదే ప్రామాణికంగా తీసుకుంది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినా మ్యాపింగ్‌లో ఒకే చోట లేకపోతే దరఖాస్తుల విచారణ ముందుకు సాగడంలేదు. మ్యాపింగ్ సమస్యతో దరఖాస్తులను నిలిపివేస్తున్నారు.



డిలీట్ ఆప్షన్ లేదు

రేషన్ కార్డులు నమోదు చేసే సమయంలో సాఫ్ట్‌వేర్‌లో డిలీట్ ఆప్షన్ ఉపయోగించడానికి వీలు కావడంలేదు. కార్డులో ఎవరైనా మృతి చెందితేనే డిలీట్ ఆప్షన్ ఉపయోగించే వెసులుబాటు ఉంది. విభజన సమయంలో ఒక కార్డులో ఉన్న సభ్యులను డిలీట్ చేసి వేరొక కార్డు మంజూరు చేయడానికి ఆప్షన్ ఇంకా ఇవ్వలేదు. దీనివల్ల ఒక కార్డులో ఉన్న సభ్యులను డిలీట్ చేసి కొత్త కార్డులో నమోదు చేసే ఆస్కారం లేదని అధికారులు వెల్లడించారు.

ఆదాయపన్ను చెల్లించినా ఇబ్బందులే..

ఒక వ్యక్తి కొంతకాలం వ్యాపారం నిర్వహించి ఆదాయపన్ను చెల్లిస్తున్నారు. తర్వాత కొన్నికారణాలవల్ల వ్యాపారం మూసివేసి ఆదాయపన్ను చెల్లించడం లేదు. అలాంటివారు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేస్తే విచారణ సమయంలో నిలిచిపోతోంది. గతంలో చెల్లించిన ఆదాయ పన్ను వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తుండడంతో కార్డు మంజూరు కావడం లేదని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త వివరాలు నమోదు చేసి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇకపైన స్మార్ట్ రేషన్‌కార్డులు

ఇకనుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు రానున్నాయి. ఇవి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. వచ్చేనెలలో వీటిని పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి ఒకవైపు జగన్‌మరోవైపు వైఎస్‌ఆర్ బొమ్మలను ముద్రించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నేతల బొమ్మలు లేకుండా కొత్త స్మార్ట్‌కార్డులను రూపొందిస్తోంది. కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీకూడా స్మార్ట్‌కార్డులుగానే ఉంటాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈస్మార్ట్ రేషన్‌కార్డును రూపొందిస్తున్నారు. దీనికోసం పౌరసరఫరాలశాఖ కసరత్తు చేస్తోంది. స్మార్ట్‌రేషన్‌కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు ఫొటో ఉంటాయి. రేషన్‌కార్డు నెంబరు, షాపు వివరాలు ఉంటాయి. కార్డు వెనుక భాగంలో కార్డుదారుని కుటుంబీకుల వివరాలు ఉంటాయి.

విచారణ వేగవంతం చేయాలని ఆదేశించాం: రుద్రరాజు సత్యనారాయణరాజు, డీఎస్‌వో, కాకినాడ జిల్లా

రేషన్‌కార్డుల విచారణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించాం. కాకినాడజిల్లాతోపాటు మిగిలినచోట్ల అన్ని సచివాలయాల్లో ప్రతిరోజూ రేషన్‌కార్డుల విచారణ జరుగుతోంది. విచారణ పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నారు. ఈకేవైసీపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. రేషన్‌కార్డులో కొంతమంది సభ్యులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంవల్ల కొంతవరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆమోదం లభించిన కార్డు లకు వచ్చేనెలలో స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేసే అవకాశం ఉంది.

జిల్లాలవారీగా పరిశీలిస్తే ఇలా..

కాకినాడ జిల్లాలో..

కాకినాడ జిల్లాలో రేషన్‌కార్డుల మార్పులు, చేర్పులు, విభజనకోసం 60,317మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటికి 40,659మంది దరఖాస్తులు ఆమోదం లభించింది. 16,170 దరఖాస్తులు విచారణలో వివిధ స్థాయిలో ఉన్నాయి. దీనిలో ప్రత్యేకించి కొత్తకార్డుల కోసం 4,968 దరఖాస్తుచేసుకోగా 2,945 రేషన్‌కార్డులకు ఆమోదం లభించింది. 2,023 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. కార్డుల విభజనకోసం 6015 దరఖాస్తులు రాగా 4,131 ఆమోదం లభించింది. 2012 దరఖాస్తులను అధికారులు విచారణ చేస్తున్నారు.

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

కోనసీమ జిల్లాలో రేషన్‌కార్డుల మార్పులు, చేర్పులు, విభజన కోసం 43,224 దరఖాస్తులు రాగా 34,200 ఆమోదం లభించింది. 9,024 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. దీనిలో కొత్తకార్డులతోపాటు విభజన సమస్యలు ఉన్న కార్డులున్నాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 43,319 దరఖాస్తులు రాగా దీనిలో 33,800 ఆమోదం లభించింది. 9,519 విచారణలో ఉన్నాయి. దీనిలో కొత్తకార్డులతోపాటు చేర్పులు, మార్పులు, విభజన సమస్యలు ఉన్నాయి.

తొలి పులస వచ్చేసింది

- యానాంలో పులస రూ.18వేలు

యానాం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోదారికి కొత్తనీరు వచ్చింది.. ఇలా వచ్చిందో లేదో.. తొలి పులస కూడా వచ్చేసింది.. ధర కూడా భారీగానే ఉందండోయ్.. రూ.18వేలు పలికింది.. గోదావరి పులసా.. మజాకానా మరి..!

మాంసహార ప్రియులకు అత్యంత ఇష్టంగా తినే పులసల సీజన్ మొదలైంది. యానాం గౌతమీ గోదావరికిఎర్రనీరు పోటెత్తిన సమయంలో పులసలు లభ్యమవుతాయి. శుక్రవారం యానాం మార్కెట్‌కు తొలి పులస వచ్చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు కిలోన్నర పులస మత్స్యకారులకు చిక్కింది. దీన్ని యానాం మార్కెట్‌లో పోనమండ భద్రం, రత్నం దంపతులు రూ.15వేలకు పాడి దక్కించుకుని దాన్ని రూ.18వేలకు విక్రయించారు. గోదావరికి వరద నీరు రావడంతో తొలి పులస దొరికింది. రానున్న వరదకు మరిన్ని పులసలు మత్స్యకారులకు దొరికే అవకాశం ఉంది.



యానాం మార్కెట్‌లో పులసతో మత్స్యకార మహిళ రత్నం

కొవ్వూరు నియోజకవర్గంలో పరిణామాలపై విచారణ

- రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని పవన్ ఆదేశం

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలపై విచారించి నివేదిక ఇవ్వాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను జనసేనాని పవన్‌కల్యాణ్ ఆదేశించినట్టు సమాచారం. కొవ్వూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి ప్రాధాన్యమివ్వడం లేదని ఆ పార్టీ నాయకుడు టీవీ రామారావు ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ అధిష్ఠానం కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా చర్యలున్నాయంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి టీవీఆర్‌ను తప్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు జనసేన కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ఆందోళన చేపట్టడంతో పార్టీ అధిష్ఠానం స్పందించింది. కొవ్వూరులో ఉన్న పరిస్థితులను తెలుసుకుని, అన్నివర్గాలతో మాట్లాడి రెండువారాల్లో నివేదికివ్వాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను ఆదేశించింది.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

దేవీపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోదావరి మళ్లీ పెరుగుతోంది. దేవీపట్నం మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలైన కొండమొదలు, నడిపూడి, తెలిపేరు, మంటూరు,కచ్చులూరు,మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం,తొయ్యేరు, పూడిపల్లి గ్రామాల్లో గోదావరి మళ్లీ పోటెత్తింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద నీరు చేరి పలు గ్రామాలను ముంచింది. రెండురోజులక్రితం గోదావరినీరు తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం నుంచి మళ్లీ గోదావరి పరివాహక ముంపు ప్రాంతాలైన కొండమొదలు నుంచి పోశమ్మ గండి వరకు గ్రామాల్లోకి వరద నీరు చేరింది. దీంతో దేవీపట్నం మండలంలో వేగంగా గోదావరి వరద పెరుగుతోంది. గండిపోశమ్మ తల్లి అమ్మవారి ఆలయంతోపాటు రోడ్లు మునిగిపోయాయి. అమ్మవారి ఆలయంవద్ద దుకాణాల్లోకి నీరు ప్రవేశించడంతో సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు.



దేవీపట్నం మండలం పోశమ్మగండి గ్రామంలో చేరిన వరదనీరు



అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో

వాడపల్లి వెంకన్న సన్నిధిలో 'జబర్దస్త్' వర్ష



స్వామివారిని దర్శించుకుంటున్న వర్ష

ఆత్రేయపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. 'జబర్దస్త్' ఫేమ్ వర్ష కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5.07లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలేనికి చెందిన కంకటాల సూర్యనారాయణ-భారతి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

పార్కింగ్ సమస్యను పరిష్కరించండి

శనివారం అరటి ఆకులో అన్నప్రసాదం అందించండి

'డయల్ యువర్ ఈవో'లో భక్తుల అభిప్రాయాలు

ఆత్రేయపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈవో నల్లం సూర్యచక్రధరరావు శుక్రవారం 'డయల్ యువర్ ఈవో' నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 32 నుంచి 40 మంది భక్తులు 08855-271888 నెంబరుకు ఫోను చేశారు. పార్కింగ్ ప్రదేశంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ప్రతి శనివారం అరటి ఆకులో భోజనం పెట్టాలని ఓ భక్తురాలు కోరింది. అనంతరం ఈవో మాట్లాడుతూ... పార్కింగ్ ప్రదేశంలో కొంత స్థలాన్ని సేకరించి మెరక పనులు చేపడుతున్నామన్నారు. ప్రతి శనివారం సుమారు 25వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారన్నారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని, ఒకేసారి 3500 మంది టేబుల్స్‌పై కూర్చుని తినేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి భక్తుడికి అరటి ఆకులో స్వామివారి ప్రసాదం అందిస్తామన్నారు. భద్రతా సిబ్బందిని పెంచుతామన్నారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం కొనసాగిస్తామని చెప్పారు.



ఫోనులో భక్తుల సమస్యలు వింటున్న ఈవో సూర్యచక్రధరరావు

'పాడా'కు రూ.3కోట్ల నిధులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.3 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ పంపిన నివేదిక ఆధారంగా ఈ నిధులు మంజూరయ్యాయి. సిబ్బంది జీతభత్యాలు, పరిపాలనాపరమైన వ్యయం, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించాలని ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ జారీ చేసిన జీవో నెం.122లో ఆదేశించారు.

నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివం



కాకినాడలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదాశివం

కాకినాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. కాకినాడలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సదాశివం మాట్లాడుతూ దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.25 వేలు కనీస వేతనం అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో నెం.130 జారీ చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల పాలక మండళ్లలో నాయీబ్రాహ్మణులకు సభ్యునిగా అవకాశం కల్పిస్తామని సీఎం చెప్పారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందజేస్తామని, బీసీ రక్షణ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఆదరణ పథకం ద్వారా చేతివృత్తులు, కులవృత్తుల వారిని ఆదుకోవడానికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు లంకా రత్నారావు, సూరవరపు నాగరాజు, యానాపు ఏసు, కోరుప్రోలు నూకరాజు, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ, సిటీ అధ్యక్షుడు వేపాడ శ్రీను, రూరల్ అధ్యక్షుడు కోట ఉమా అచ్యుత రమణ, కింతాడ సత్తిబాబు, కొమ్మల తాతారావు, మల్లువలస విష్ణుచక్రం, మెల్లిపాక నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త జోక్యం

రూ.3.66 కోట్ల లైబ్రరీ సెస్ బకాయిలకు మోక్షం

కాకినాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్త జోక్యంతో దశాబ్దకాలంగా పెండింగులో ఉన్న రూ.3.66 కోట్ల లైబ్రరీ సెస్ బకాయిలు వసూలయ్యాయి. కాకినాడ జిల్లాకు చెందిన కె.సాంబశివరావు చేసిన ఫిర్యాదు (32 04/2017/బి1) మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ స్థానిక సంస్థల నుంచి ఈ బకాయిలను గ్రంథాలయ సంస్థ తిరిగి పొందడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కీలక పాత్ర పోషించింది. 2007-08 నుంచి 2016-17 మధ్య కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, తుని, పిఠాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటు అన్ని గ్రామ పంచాయతీలు సేకరించిన లైబ్రరీ సెస్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించడంలో విఫలమయ్యాయని సాంబశివరావు ఫిర్యాదు చేశారు.

దీనిపై లోకాయుక్త జారీ చేసిన ఆదేశాలకు స్పందిస్తూ కలెక్టర్ విచారణ చేపట్టి బకాయిలు ఉన్నమాట వాస్తవమేనని అంగీకరిస్తూ నివేదిక సమర్పించారు. లోకాయుక్త నిరంతర జోక్యం, పర్యవేక్షణ కారణంగా సదరు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, స్థానిక సంస్థలు తాము బకాయిపడ్డ రూ.366.88 లక్షలు చెల్లించాయి.


సంస్థాగతంగా ఏర్పడిన అవకతవకలను నివారించడం, స్థానిక సంస్థల మధ్య జవాబుదారీతనాన్ని పెంపొందించడం. లైబ్రరీ సెస్ వంటి చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చడంలో లోకాయుక్త తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తోందని, ప్రజలకు సేవలు అందించడంలో పారదర్శకత, సమస్యలను పరిష్కరించడానికి నిబద్ధతతో పనిచేస్తోందని లోకాయుక్త రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నర్సరీలను సందర్శించిన కర్ణాటక మంత్రి మల్లికార్జున్

కడియం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలోని ఏకేఎస్‌వీ నర్సరీని కర్ణాటక రాష్ట్ర మైనింగ్, జియాలజీ, ఉద్యాన శాఖల మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ శుక్రవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత రత్నం అయ్యప్ప మొక్క అందించి స్వాగతం పలికారు. కొన్ని రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్, ఔషధ మొక్కల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కడియపులంకలోని గౌతమి, కోదండరామ, సత్యనారాయణ, శివాంజనేయ నర్సరీలను సందర్శించారు. దేశంలో కడియం హార్టికల్చర్ హబ్‌గా ఉందని కితాబిచ్చారు.



బుర్రిలంకలోని ఏకేఎస్‌వీ నర్సరీని తిలకిస్తున్న మంత్రి మల్లికార్జున్



భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న స్వామీజీ

విజయానంద తీర్థ స్వామీజీ చాతుర్మాస్య దీక్ష

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంలో అత్యంత పవిత్రంగా భావించే చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవానికి కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం అగ్రహారంలో కొలువైయున్న అనఘా దత్త క్షేత్రం వేదికైంది. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ ప్రత్యేక పూజల అనంతరం చాతుర్మాస్య వ్రత దీక్ష చేపట్టారు. దీనిని సెప్టెంబరు 7వ తేదీ వరకు కొనసాగించనున్నారు. గురుపరంపర పూజ, చైతన్యార్చన, వ్యాస పూజ, గణపతి సచ్చిదానంద పాదుకా పూజ జరిగాయి. నవకోటి దత్తయాగ మహా సంకల్పంలో భాగంగా అష్టమ కోటి దత్త యాగానికి అంకురార్పణ చేశారు. సాయంత్రం గురుగీతా పారాయణ జరిగింది. యజుర్వేద ఘన పారాయణను ప్రారంభించారు. ఇది ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగుతుంది. సాయంత్రం జైమిని భారతం చాతుర్మాస్య ప్రవచనాలను ప్రారంభించారు. చాతుర్మాస్య దీక్ష చేపట్టిన దత్త విజయానంద తీర్థ స్వామీజీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు ప్రముఖులు కలిశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

లైంగిక వేధింపులు నిజమే..

- జీజీహెచ్ విద్యార్థినులతో ల్యాబ్ టెక్నీషియన్ తరచూ అసభ్య ప్రవర్తనే
- విద్యార్థినులను లైంగికంగా వేధించిన చక్రవర్తిపై విచారణ కమిటీ నివేదిక వెల్లడి
- 55 మంది విద్యార్థినులు, 15 టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఫిర్యాదులన్నీ నిజమే
- మరో ముగ్గురు సిబ్బంది కూడా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

"ఏయ్..ఒక్కడినే వెళ్తున్నా...కారులో వస్తావా...ఏంటీ సరిగ్గా డ్యూటీ చేయడం లేదు.. ఆరోజు ఏకాంతంగా కలుద్దామా...ఈ మధ్య బాడీ వెయిట్ పెరిగిపోతోంది..రూంలోకి వెళ్దామా..అన్నీ చూసుకుంటా.." అంటూ భుజాల మీద చేతులు వేయడం..అక్కడి నుంచి నడుంపైన.. తొడలను తాకడం..ఎవరైనా పేషెంట్లు చూసి మందలిస్తే వారిపైనా అరవడం...ఇలా ఒకటేంటి రకరకాల వెకిలి చేష్టలతో లైంగిక వేధింపులకు పాల్పడడం జీజీహెచ్‌లో బయోకెమిస్ట్రీ ల్యాబ్ అసిస్టెంట్ వి.కళ్యాణ్ చక్రవర్తి పరిపాటిగా మారింది. ఒకటికాదు రెండుకాదు అనేకసార్లు ఇతడి ప్రవర్తన గతి తప్పి వ్యవహరిస్తూనే ఉంది. పలుసార్లు విద్యార్థినులు సంబంధిత విభాగం హెచ్‌వోడీ దృష్టికి చక్రవర్తి కీచకపర్వాన్ని తీసుకెళ్లినా చక్ర వర్తి తన తీరు మార్చుకోలేదని విచారణ కమిటీ స్పష్టంచేసింది. జీజీహెచ్‌లో విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఘటనపై విచారణ చేపట్టిన అంతర్గత కమిటీ తన నివేదికను రంగరాయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్‌కు శుక్రవారం అందజేసింది. తమ విచారణలో తేలిన అనేక విషయాలను నివేదికలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ కూలంకుషంగా వివరించారు. జీజీహెచ్‌లో డీఎంఎల్‌టీ, బీఎస్సీ, ఎంఎల్‌టీ, వొకేషనల్ ఎంఎల్‌టీ విద్యార్థినులు మొత్తం 55మంది నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నామని తెలిపింది. ఇవికాక బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, పాథాలజీ విభాగాలకు చెందిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ 15 మంది సైతం చక్రవర్తి లైంగిక వేధింపులను పూసగుచ్చినట్టు వివరించారని నివేదికలో ప్రస్తావించింది. ఎన్నో రోజులుగా ల్యాబ్ అసిస్టెంట్ ఎందరో విద్యార్థులను వేధించినట్టు తేల్చింది. కానీ బాధితులు భయంతో ముందుకు రాలేదని పేర్కొంది. దీన్ని అలుసుగా తీసుకుని



నిందితుడు కళ్యాణ్ చక్రవర్తి

చక్రవర్తి మరింత రెచ్చిపోయినట్టు వివరించింది. అనేకసార్లు విద్యార్థులను లైంగికంగా వేధించినట్లు తమ విచారణలో తేలినట్టు తెలిపింది. చక్రవర్తి అసభ్య ప్రవర్తన గురించి తమకు కూడా తెలుసని బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, పాథాలజీ విభాగాల సిబ్బంది కమిటీ ఎదుట వివరి ంచారని స్పష్టం చేసింది. అలాగే బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ, కొందరు అనేకసార్లు చక్రవర్తిని హె చ్చరించారని, అయినా సదరు ఖాతరు చేయ లేదని కమిటీ తేల్చిచెప్పింది. జీజీహెచ్ ఓపీ విభాగంలోని శాంపిల్ కలెక్షన్ సెంటర్‌లో తరచూ అసభ్యంగా ప్రవర్తిస్తోన్న చక్రవర్తికితోడు మైక్రో బయోలజీ ల్యాబ్ టెక్నీషియన్ జిమ్మీరాజు (ఇతడు కోనసీమ జిల్లా మండపేట నియోజకవ ర్గంలోని ఓ వైసీపీ సర్పంచ్‌కు దగ్గరి బంధువు. సదరు సర్పంచ్ గతంలో ఉమ్మడి జిల్లా రెవెన్యూ అసోసియేషన్‌లో కీలక నాయకుడిగా సైతం వెలిగారు). బయోకెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ గో పాలకృష్ణ ఇద్దరు మద్యం తాగి డ్యూటీకి వచ్చే వారని నివేదికలో కమిటీ వివరించింది. మద్యం తాగి విద్యార్థులపై అరుస్తూ వారిని వేధించే వారని తెలిపింది. అలాగే పాథాలజీ ల్యాబ్ అసి స్టెంట్ ప్రసాద్ అయితే విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని బూతులు తిట్టేవాడడని వివరించింది.

ఇదిలాఉంటే ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని రంగరాయ కాలేజీ ప్రిన్సిపాల్ కాకినాడ ఏఎస్పీకి శుక్రవారం లేఖ రాశారు. ఈనెల 9న రాత్రి 10.12గంటలకు విద్యార్థినుల నుంచి మెయిల్‌లో ఫిర్యాదు అందిందని, దీని ఆధారంగా విచారణ చేపట్టామని అందులో పేర్కొన్నారు. అందులో చక్రవర్తి అసభ్యకరంగా విద్యార్థినులతో వ్యవహరించాడని.. డర్టీ, వల్గర్, రబ్బీష్ భాష వాడి విద్యార్థినులు, పేషెంట్లను వేధించాడని పేర్కొన్నారు. బాడీ షేమింగ్ చేయడంతోపాటు ఏకాంతంగా విద్యార్థులను తన గదికి రమ్మని కోరినట్లు తేలిందని వివరించారు. అతడికి తోడు మరో ముగ్గురు ల్యాబ్ సిబ్బంది సైతం విద్యార్థినులను వేధించిన నేపథ్యంలో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం సీరియస్...

జీజీహెచ్ విద్యార్థినులపై లైగింక వేధింపుల వ్యవహారం ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌లో కూలంకుషంగా రావడం తీవ్ర కలకలం రేపింది. దీనిపై సీఎం చంద్రబాబు తక్షణం స్పందించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో మాట్లాడారు. తక్షణం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఆగమేఘాలపై పోలీసులు నిందితులపై కేసులు నమోదు చేశారు. అటు ఉద్యోగాల నుంచీ సస్పెండ్ చేశారు. ఘటన వెనక ఏం జరిగింది? విద్యార్థినులను నిందితులు ఏవిధంగా లైంగికంగా వేధించారనేదానిపై కలెక్టర్, ఎస్పీ శుక్రవారం మధ్యాహ్నం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితులపై తీసుకున్న చర్యలను ప్రకటించారు.

ఆ నలుగురి అరెస్ట్!

- వారిపై చట్టపరమైన చర్యలు
- ధైర్యంగా ఫిర్యాదు చేసిన విద్యార్థినులు, స్పందించిన ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలకు అభినందనలు
- 'రంగరాయ' లైంగిక వేధింపుల ఘటనపై వివరాలు వెల్లడించిన కాకినాడ కలెక్టర్
- ఫిర్యాదు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేశాం : కాకినాడ ఎస్పీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

రంగరాయ వైద్యకళాశాలలోని పారామెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధించడమే కాకుండా అసభ్యకరంగా, అనుచితంగా మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్న నిందితులు ల్యాబ్ అటెండెంట్ వాడ్రేవు కల్యాణ్ చక్రవర్తి, మైక్రోబయాలజీ ల్యాబ్ టెక్నీషియన్ బి.జిమ్మిరాజు, బయోకెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.గోపాలకృష్ణ, పేథాలజీ విభాగ ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్‌లపై విచారణ జరిపి వారిని విధుల నుంచి సస్పెండ్ చేయడంతోపాటు అరెస్టు చేసినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. కాకినాడ రంగరాయలో పారా మెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న ఘటనపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇలాంటి ఘటనలు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో పునరావృతం కాకుండా చేపట్టిన చర్యలను వివరించారు.

విద్యార్థినుల ఆరోపణలు నిజమే

రంగరాయ వైద్యకళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.కల్యాణ్‌చక్రవర్తి తమ పట్ల అసభ్యంగా ప్రవరిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని కళాశాలలో బీఎస్సీ-మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ కోర్సు చదువుతున్న 50 మంది విద్యార్థులు ఈనెల 9వతేదీన ఈ మెయిల్ ద్వారా కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. దీనిపై ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి ఈ ఫిర్యాదును కళాశాలలోని లైంగిక వేధింపుల నిరోధానికి కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ విచారణకు అప్పగించారని..ఈ కమిటీ ఈనెల 9, 10 తేదీల్లో బీఎస్సీ-ఎంఎల్‌టీ కోర్సు చదువుతున్న 50మంది విద్యార్థినులు, నిందిత ఉద్యోగులను విచారించి అందరి వాంగ్మూలాలు, సాక్ష్యాలను నమోదు చేసిందన్నారు. ఈ విచారణలో 50 మంది విద్యార్థినులు నిందితుడు వాడ్రేవు కల్యాణ్ చక్రవర్తితోపాటు మరో ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఎస్.గోపాల్‌కృష్ణ, బి.జిమ్మిరాజు, జీవీఎస్ ప్రసాదరావులు కూడా తమపై లైంగిక వేదింపులు, అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్టు తెలిపారన్నారు. కమిటీ విచారణలో ఈ నలుగురిపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిజమని తేలిందని, ఈ మేరకు నలుగురి నిందితులను రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసి వారిపై స్థానిక కాకినాడ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయగా శుక్రవారం వారందరినీ అరెస్టు చేశారని కలెక్టర్ వివరించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనలో తమపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేసిన విద్యార్థినులను, ఫిర్యాదుపై తక్షణ విచారణ నిర్వహించి, వారిలో వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నింపిన ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలను కలెక్టర్ అభినందించారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోండి : కాకినాడ ఎస్పీ

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎంసీ ఘటనలో పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఉదయం ఫిర్యాదు నమోదు కాగా నేరారోపితులు నలుగురినీ మధ్యాహ్నం రెండున్నర గంటలలోపు అరెస్టు చేశామన్నారు. సంబంధిత సెక్షన్ల ప్రకారం అరెస్టు చేశామని వెల్లడించారు. బాలికలు, మహిళల రక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా పోలీసుశాఖ శక్తియాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని.. విద్యార్థినులు, వర్కింగ్ ఉమెన్ తమపట్ల జరిగే అకృత్యాల నుంచి రక్షణ పొందేందుకు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, ఆర్‌ఎంసీ పారామెడికల్ కోర్సుల కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ ఉన్నారు.

ధరాభారం!

- బహిరంగ మార్కెట్లో మండుతున్న కూరగాయల ధరలు
- లోకల్ పంట లేకపోవడంతో భారీగా పెరుగుదల
- మరింత పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్లో లభ్యత లేకపోవడంతో బహిరంగ మార్కెట్లలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దాదాపు కూరగాయలన్నింటినీ ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో మార్కెట్ దళారీలు, రవాణా చార్జీలు, వ్యాపారుల లాభం కలగలసి సామాన్యుడి ఆర్థిక వెన్ను విరుస్తున్నాయి. లోకల్‌గా రైతులు పండించే కూరగాయల సీజన్ ముగియడం, వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా దిగుబడులు లేకపోవడం పరిస్థితిని దిగజార్చుతున్నాయి. ఫలితంగా వంటల్లో ప్రధానమైనవి గా పరిగణించే టమోటా, పచ్చిమిర్చి, వంకాయలు, బీరకాయలు వంటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బహిరంగ మార్కెట్లలో టమోటా కిలో రూ.60కు చేరుకోగా, పచ్చిమిర్చి మరింత ఘాటెక్కి రూ.120కు చేరింది. చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమోటాను, కడప జిల్లా మైదుకూరు నుంచి పచ్చిమిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. వంకాయల ధరలోనూ పెరుగుదల కనిపిస్తోంది. దొమ్మేరు రకం వంకాయలు కిలో రూ.80 వరకూ ధర ఉంది. కడప జిల్లా గిద్దలూరు నుంచి అంకూరు చిక్కుళ్లు, వంకాయలు తెస్తున్నారు. బహిరంగ మార్కెట్లలోని ధరలతో పోల్చితే అధికారుల నియంత్రణలోని రైతుబజార్లలో ధరలు కాస్త తక్కువే అనిపించినా క్వాలిటీలో రాజీ పడాల్సి ఉంటుందనేది అందరికీ తెలిసిందే. ధనికవర్గాలకు దీని వల్ల ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మధ్యతరగతి, సామాన్యజీవులకు మాత్రం భారంగా మారుతోంది.

అప్పటి వరకూ భరించాల్సిందే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలైన సీతానగరం, కడియం మండలాలతోపాటు కోరుకొండ మండలం నుంచి రాజమహేంద్రవరం మార్కెట్లకు కూరగాయలు ఎక్కువగా వస్తుంటాయి. టమోటా సీతానగరం మండలంలోని రాజంపేట, కూనవరం ప్రాంతాల్లో ఎక్కువ సాగు చేస్తారు. కడియం ఏరియాలో టమోటా సాగు విస్తీర్ణం చాలా తక్కువ. టమోటా సాగుకు వాతావరణం ప్రతిఏటా ఆగస్టు, సెప్టెంబరులో మాత్రమే అనుకూలంగా ఉంటుంది. దీంతో లోకల్ టమోటా డిసెంబరులో మాత్రమే చేతికి అందుతుంది. అలాగే, లోకల్‌గా బీర, బెండ, దొండ, ఆనబ, వంకాయ వంటి కూరగాయల సాగు ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నారు. వీటి దిగుబడులు రావాలంటే దాదాపు నెలన్నర సమయం పడుతుందని చెబుతున్నారు. అప్పటి వరకూ బయటి సరుకుపైనే ఆధారపడాల్సి ఉంటుంది. అప్పటి వరకూ ధరలు భరించక తప్పని పరిస్థితి ఉంటుంది.

లభ్యత తక్కువ, డిమాండ్ ఎక్కువ...

రావులపాలెం సమీపంలోని మడికి మార్కెట్‌కు ఆ చుట్టుపక్కల రైతులు సాగుచేసే కొన్ని రకాల కూరగాయలు వస్తున్నా హోల్‌సేల్ మార్కెట్ కారణంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వ్యాపారులు ఎక్కువ ధరపెట్టి పాడుకుని తరలించుకుపోతుంటారు. దీంతో దాని ప్రభావం లోకల్ మార్కెట్లపైనా పడుతుంది. మార్కెట్‌లో లభ్యత తక్కువ, డిమాండ్ ఎక్కువ కారణంగా కూరగాయల ధరలు దిగిరావడంలేదు. ఈ పరిస్థితి మరి కొన్నాళ్లు తప్పకపోవచ్చనే అభిప్రాయం రైతులు, వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది.

ధరలు ఎలా ఉన్నాయంటే...

రెండు వారాల క్రితం ఉన్న కూరగాయల ధరలకు ఇప్పుడున్న ధరలకు అసలు పోలికలేదు. కొన్ని కూరగాయలు రెట్టింపు ధర పెరిగితే, పచ్చిమిర్చి ధర మూడింతలు ఎక్కువైంది. అంతలా రేట్లు భగ్గుమంటున్నాయి. బహిరంగ మార్కెట్లలో ధరలను పరిశీలిస్తే ... కిలో టమోటా రూ.30 నుంచి రూ.60కు పెరిగింది. దొమ్మేరు వంకాయలు రూ.40 నుంచి రూ.80కి, పచ్చిమిర్చి 40 నుంచి రూ.120కి, బీరకాయలు రూ.40 నుంచి రూ.60కి, దొండకాయలు రూ.30 నుంచి 60కి, చిక్కుళ్లు రూ.50 నుంచి రూ.110కి, క్యాప్సికం రూ.40 నుంచి 120కి ధర పెరిగిపోయింది. రైతుబజార్లలోనూ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. కిలో పచ్చిమిర్చి రూ.55, టమోటా రూ.30, దొమ్మేరు వంకాయలు రూ.54, సర్పవరం గులాబీరకం రూ.48, తెలుపుచార రూ.40, నలుపు రూ.44, బీరకాయలు రూ.44, దొండకాయలు రూ.38, చిక్కుళ్లు రూ.70, క్యాప్సికం రూ.90గాఉంది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతుబజార్లలోని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనం తిని 21 మంది విద్యార్థులకు అస్వస్థత

- పాఠశాలలో పులిహోర, టమోటా పచ్చడి వడ్డింపు
- తిన్న పది నిమిషాల్లో కొందరికి వాంతులు, కడుపునొప్పి
- గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలింపు



గౌరిదేవిపేట పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఎటపాక,జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తిని 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 139 విద్యార్థులు చదువుతు న్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు పులిహోర, టమోటా పచ్చడి వడ్డించారు. అది తిన్న విద్యార్థులు పది నిమిషాల్లో అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే వారిని సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. మొత్తం 21మంది అస్వస్థతకు గురవ్వగా అందులో ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులే ఉన్నారు. అందులో ఆకుల రామలక్ష్మీ, బొగ్గా ప్రేమిక, రాయి లోకేశ్‌కు వాంతులు కావడంతో సెలైన్లు ఎక్కించి చికిత్స అందించారు. మరో 18 మంది విద్యార్థులకు కడుపు నొప్పి రావడంతో ప్రథమ చికిత్స చేశారు. అయితే ఉడికీ ఉడకని పులిహోర తినడం వల్లే విద్యార్థులకు అజీర్తీ చేసిందని, దాంతో అస్వస్థతకు గురైనట్టు వైద్యాధికారి దీవీనాగ్ తెలిపారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంటషెడ్డులేక బరకాలు కట్టి అపరిశుభ్ర వాతావరణంలో వంటలు తయారుచేస్తున్నట్టు విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బరకాలపై నుంచి ఆహారంపై ఈగలు, బొద్దింకలు పడుతున్నాయని విద్యార్థులు చెప్తున్నారు.

విచారణకు పీవో ఆదేశం

విద్యార్థులకు అస్వస్థత విషయం తెలుసుకున్న ఐటీడీఏపీవో అపూర్వ భరత్ వెంటనే స్పందించారు. ఘటనపై వెంటనే విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఎంఈవో సరియం రాజులును ఆదేశించారు. దాంతో ఎంఈ వెంటనే గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులతో విచారణ జరిపారు. ఘటనకు గల కారణాలు, విద్యార్థులకు వడ్డించిన ఆహారం విషయంపై అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పీవో అడిగి తెలుసుకున్నారు.

వివాదాల పరిష్కారంలో మన ధోరణిదే ముఖ్య పాత్ర : పీడీజే సునీత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కుటుంబం, సమాజంలో వివాదాలు రావడం సహజమని వాటిని ఎలా పరిష్కరించుకోవాలనే అనే అంశంలో మన ధోరణి ముఖ్య పాత్ర వహిస్తుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయవాద మధ్యవర్తిత్వంపై ప్రొఫెషనల్- ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మధ్యవర్తిత్వంలో శిక్షణ ద్వారా సమస్యల పరిష్కారానికి సహకార దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, కేరళకు చెందిన సీనియర్ ట్రైనర్లు థాంకచన్, సురేశ్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు అమలాపురంలో ఉచిత మెగా వైద్యశిబిరాలు

అమలాపురం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి) తెలిపారు. ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి కుసుమంచి పాపారావు, అమలాపురం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, వరదా సూరిబాబు, పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబులు, కాసు శ్రీనివాస్‌లతో కలిసి శుక్రవారం ఆయన అమలాపురంలో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, అమలాపురం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నదన్నారు. వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, గైనిక్, డెంటల్, ఈఎన్‌టీ సంబంధిత సమస్యలకు సంబంధించిన వైద్యులు శిబిరంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా ఈసీజీ, ఎకో వంటి టెస్టులతో పాటు రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దంత సమస్యలకు సంబంధించి క్లీనింగ్, సిమ్మెంట్ ఫిల్లింగ్ వంటివి ఉచితంగా చేయనున్నట్టు వెల్లడించారు. అమలాపురంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ల జనార్ధనరావు కల్యాణ మండపం, కొల్లూరి సత్యనారాయణమూర్తి మినీ కల్యాణ మండపాల్లో వైద్య శిబిరాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమ్మ దగ్గరికి వెళ్తా...

తల్లి మృతి తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య



మరణించిన వెంకటేశులు

బిక్కవోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతిని తట్టుకోలేక కొడుకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం రంగాపురానికి చెందిన కానాటి వెంకటేశులు (30) తల్లి 3 నెలల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి వెంకటేశులు తల్లిపై బెంగపెట్టుకుని మతిస్థిమితం లేకుండా ఉండడంతో రాజమహేంద్రవరం మానస ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే తరచూ తన తల్లి వద్దకు వెళ్లిపోతాననేవాడు. గురువారం ఉదయం అతడు గడ్డి మందు తాగి వాంతులు చేసుకోవడంతో భార్య ప్రశ్నించగా మా అమ్మ వద్దకు వెళ్లిపోతున్నానని తెలపడంతో వెంటనే అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పాండవులు (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మరణించాడు. గ్రామానికి చెందిన మాగిరెడ్డి పాండవులు(47) మద్యానికి బానిసై ఇంటి నుంచి తరచూ వెళ్లిపోవడం, కొంతకాలానికి తిరిగి రావడం చేస్తున్నాడు. ఇదే రీతిలో ఈనెల 10న ఇంటికి తిరిగి వచ్చిన అతడు పేలు మందును మద్యంలో కలిపి తాగాడు. అతడిని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొం దుతూ పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో మరణించాడు. మృతుడి కుమారుడు నాగబాబు ఫిర్యాదుతో గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేశ్ (ఫైల్)

దేవరపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గొల్లగూడెంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గోపాలపురం మండలం వేలచింతల గూడెనికి చెందిన మందపాటి రాజేశ్ (20) గొల్లగూడెంలో కేబుల్ ఫైబర్‌నెట్‌లో పోతుల శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గొల్లగూడెం దగ్గర కేబుల్‌వైర్‌ను ఎలక్ట్రికల్ స్తంభానికి కడుతుండగా 11కేవీ విద్యుత్‌వైరు తగలడంతో నిచ్చెన పై నుంచి రాజేశ్ కింద పడడంతో తీవ్ర గాయాలుకాగా గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తునిరూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ యార్డు వద్ద రైలు పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని శుక్రవారం రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సుమారు 40ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, నలుపు రంగు షార్ట్, ఎడమచేతిపై మిర్సో అనే పచ్చబొట్టు ఉందని రైల్వే పోలీస్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే 9490619020లో సంప్రదించాలని కోరారు.

'అన్నవరం'లో అభివృద్ధి పనులకు ఆమోదం

- రూ.70 లక్షలతో సీసీకెమెరాల రికార్డింగ్ సామర్థ్యం 90 రోజులకు పెంపుదల
- రూ.23 లక్షలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా డివైడర్స్ ఏర్పాటు

అన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం పలు అభివృద్ధి పనుల అంశాలను చైర్మన్ ఐవీ రోహిత్ ఆమోదించారు. ఈవో వీర్ల సుబ్బారావు, ఇతర అధికారులు ప్రతిపాదించిన అంశాలపై చర్చించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రధానంగా రూ.70 లక్షలతో సీసీకెమెరాల రికార్డింగ్ బ్యాకప్ సామర్థ్యాన్ని 90రోజులకు పెంచేందుకు అవసరమైన సర్వర్ల కొనుగోలు, హార్డ్‌డిస్క్‌ల ఏర్పాటుకు సిద్ధం చేసిన అంచనాలు ఆమోదించి దేవదాయ కమిషనర్ అనుమతితో చేపట్టాలని నిర్ణయించారు. రూ.27లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న మెట్ల మార్గంలో స్ట్రీట్‌లైట్స్, సౌండ్‌సిస్టమ్, సీసీకెమెరాలు, ప్యానల్‌బోర్డు, కేబుల్ ఏర్పాటుకు అంచనాలకు అంగీకారం తెలిపారు. రూ.23 లక్షలతో రత్నగిరి, సత్యగిరిపై వివిధ ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రీకాస్ట్ ఆర్‌సీసీ6 డివైడర్స్ ఏర్పాటుకు అంచనాలు, రూ.26 లక్షలతో సత్యగిరి పవర్‌హౌస్ నుంచి విష్ణుసదన్ వద్దకు పాడైన కేబుల్ స్థానంలో నూతనంగా కొనుగోలు చేయడానికి, రూ.18.65 లక్షలతో వ్రత మండపాల వద్ద స్లాబ్‌లీకులు అరికట్టడం తదితర పనులకు, కనకదుర్గ, వనదుర్గ ఆలయం రంగులు వేసేందుకు ఇటీవల పిలిచిన టెండర్లలో లోయస్ట్ టెండర్‌ను ఆమోదించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రూ.6.75 లక్షలతో రోడ్డు విస్తరణ చేపట్టి సీసీరోడ్డు వేయడానికి తయారుచేసిన అంచనాలను రూ.9.25 లక్షలతో పంపా రిజర్వాయర్ నుంచి బోర్‌వెల్స్‌కు వెళ్లే మార్గానికి ర్యాంప్ ఏర్పాటుకు తయారుచేసిన అంచనాలను ఆమోదించి నియమ నిబంధనల మేరకు పనులు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈఈలు, ఇంజనీరింగ్, విద్యుత్‌విభాగ అధికారులు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.

చిన్నారిని బలిగొన్న పైపులైన్ గొయ్యి

గోతిలో పడి నాలుగేళ్ల బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు శ్రీను

దివాన్‌చెరువు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువులోని రేగులచెరువు జంగాల కాలనీలో పైపులైన్ కోసం తీసిన గొయ్యి నాలుగేళ్ల చిన్నారిని బలిగొంది. స్థానికుల వివరాల ప్రకారం.. స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది పైపులైన్ మరమ్మతు కోసం వారం రోజుల క్రితం తవ్విన గోతిలోకి నీరు చేరింది. జంగాల కాలనీలో నివసించే కడమంచిలి దుర్గారావు కుమారుడు శ్రీను (4) శుక్రవారం సాయంత్రం ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఆ గోతిలో పడిపోయాడు. ఈ విషయాన్ని తోటి పిల్లలు శ్రీను తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు వెంటనే చేరుకుని చూసేసరికి అప్పటికే శ్రీను మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, కూటమి నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కాగా బొమ్మూరు పోలీసులు కూడా ఘటనా స్థలం వద్దే ఉన్నారు. అయితే తమకు ఏ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మురళీమోహన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

గండేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): 2 కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కిర్లంపూడి గ్రామానికి చెందిన టి.రాజశేఖర్ గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు.



తొండంగి ఎంపీడీవో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ

తొండంగి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి ఎంపీడీవో బి.రాజేశ్వర్రావును సస్పెండ్ చేస్తూ పంచాయితీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళి మండలంలో ఈవోపీఆర్డీ, ఎఫ్ ఏసీ ఎంపీడీవోగా పనిచేసిన సమయంలో రూ.14 లక్షల 84 వేల 900 నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అభియోగాలు రుజువు కావడంతో కమిషనర్ సస్పెన్షన్ నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తుని ఎంపీడీ వోకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

డీఎస్‌వోగా రవికుమార్ బాధ్యతల స్వీకారం

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ హెల్త్ సెక్షన్ డీఎస్‌వోగా డి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సాధారణ బదిలీపై వచ్చారు. రవికుమార్‌ను సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

'పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. సామర్లకోటలో డ్రైవింగ్ లైసెన్స్ లేని కార్మికులతో డ్రైవర్ పనులు చేయిస్తున్నారని, ప్రమాదాలు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ధర్నాలో బొబ్బిలి ఈశ్వరరావు, బంగారు రాజేష్, నిమ్మకాయల ఈశ్వరరావు, బండి అప్పన్న, విక్కీ మణికంఠ, కసింకోట కిషోర్, బొత్స శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో అర్జీ స్వీకరిస్తున్న టీడీపీ నేతలు

ప్రజా దర్బార్‌లో 15 అర్జీలకు సత్వర పరిష్కారం

సామర్లకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 30 అర్జీలు నమోదు కాగా సాయంత్రానికి 15 అర్జీలకు చెందిన సమస్యలను పరిష్కరించినట్టు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి చెప్పారు. టీడీపీ నాయకులు అరిగెల శ్రీనివాసరావు (బుస్సి), ఆనంద్‌న్యూటన్, చింతపల్లి అర్జున్, దుర్గాప్రసాద్, జున్నూరు బాబ్జీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, యాళ్ల చక్రవర్తి, డీఆర్‌యూసీసీ సభ్యుడు ముత్యాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ సక్రమంగా చేపట్టాలి: డీపీవో రవికుమార్

కరప, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సందర్భంగా తాగునీటికి సంబంధించి క్లోరినేషన్ సక్రమంగా చేపట్టాలని, ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన కరప శివారు పేపకాయల పాలెంలో మంచినీటి ట్యాంకు వద్ద ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను పరీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 15 రోజులకోసారి మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని కార్యదర్శులకు సూచించారు. పంచాయతీల్లో రిజిస్టర్ ఏర్పాటుచేసి రోజువారీ ఎంత క్లోరిన్ కలుపుతున్నారో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని డీపీవో పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో నలాది వెంకట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి ఉన్నారు.



గేట్ క్లబ్ అధ్యాపక బృందంతో కైట్ ప్రిన్సిపాల్స్ రేవతి, రామకృష్ణ

గేట్ క్లబ్‌తో 'కైట్' ఎంవోయూ

కాకినాడ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన గేట్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ దశరథ్, 17 మంది అధ్యాపక బృందంతో కైట్ విద్యా సంస్థల చైర్మన్ పోతుల విశ్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారని ప్రిన్సిపాల్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది పీజీఈసెట్‌లో తమ విద్యార్థి 60వ ర్యాంకు సాధించాడన్నారు. గేట్ ఎంట్రన్స్‌లో కూడా తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఈ ఎంవోయూ ఎంతగానో దోహదపడుతుందని విశ్వం చెప్పారు. డాక్టర్ దశరథ్ మాట్లాడుతూ గేట్ ఎంట్రన్స్ ద్వారా ఐఐటీ, ఎన్ఐటీలతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో మాస్టర్స్ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ ప్రోగ్రాంల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని, పరిశోధనా రంగంలో రాణించవచ్చని, ఇంజనీరింగ్, సాంకేతికత, సైన్స్ రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కైట్ ప్రిన్సిపాల్ రేవతి పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా ఔదార్యం

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మ పీఠం అష్టమ పీఠాధిపతి డాక్టర్ మొహిద్దీనర్ బాద్‌షాకు వెన్నంటి ఉండి పెదపాటి ధర్మయ్య అందించిన సేవలకు పేదరికంలో అతని కుమారుడు రత్నరాజుకు ప్రస్తుత పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అండగా నిలిచారు. రత్నరాజుకు తన సొంత నిధులతో గృహాన్ని నిర్మించారు. దీనిని డాక్టర్ ఉమర్ ఆలీషాతో పాటు విశ్రాంత ఐఏఎస్ దాసరి శ్రీనివాసు ప్రారంభించారు. ఉమర్ ఆలీషా సోదరులు అహ్మద్ ఆలీషా, హుస్సేన్‌షా, జేఎన్టీయూ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వరప్రసాద్, మునిసిపల్ కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, పెదపాటి రాజేష్ పాల్గొన్నారు.



ధర్మయ్య కుటుంబానికి నిర్మించిన గృహాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

కాకినాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా శుక్రవారం ఆయన 13, 23 డివిజన్లలో పర్యటించారు. నాయకులు వొమ్మి బాలాజీ, గుత్తుల రమణ, గెడ్డం పూర్ణచంద్రశేఖర్, గాది శివ రామకృష్ణ, హోతా రవి, చింతలపూడి రవి, బలసాడి రంగారావు, మేడిశెట్టి బుజ్జి, జహరుల్లాఖాన్, నిద్రబింగి సత్తిబాబు, రాళ్లపూడి ప్రకాష్, గండిబోగుల గంగాధరరావు, ఎలమంచిలి శ్రీనివాస్, నురుకుర్తి సాయి, పరిమి వీరభద్రరావు, కనితి నాగలక్ష్మి, అయినవిల్లి పద్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): సుంకరపాలెంలో పదో క్లస్టర్ ఇన్‌చార్జి మోపూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలులో లోపాలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ నేతలు వేగేశ్న భాస్కరరాజు, మోపూరి వెంకటరెడ్డినాయుడు, బాలకృష్ణ, రవికుమార్, అశోక్ పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ గ్రామంలో పర్యటించి మహిళలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తోటకూర శ్రీనివాసు, గుమ్మళ్ళ రామకృష్ణ, చీకట్ల వెంకటేష్, కొప్పిరెడ్డి రాజా, పలివెల చంద్రశేఖర్, తలారి శ్రీను, దమ్మాల శ్రీను, జెమ్మీ, మునిరెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): జల్లూరులో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పర్యటించి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మరిడమ్మ దేవస్థానంలో నిత్యాన్నదానానికి కృషి

డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదానం చేసేందుకు కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. మరిడమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణను ఆయన శుక్రవారం ప్రారంభించారు. సుమారు మూడువేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, కూటమి నాయకులు పొలమరశెట్టి సత్తిబాబు, తూతిక రాజు, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు. మరిడమ్మ అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో అర్చకులు, వేద పండితులు అర్చన జరిపారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించవచ్చని 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి పేర్కొన్నారు. పిఠాపురంలోని కోర్టుల ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మధ్యవర్తిత్వ వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను న్యాయాధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కక్షిదారుల మధ్య అవాంతరాలు తొలగించి కేసులను పరిష్కరించవచ్చన్నారు. మధ్యవర్తిత్వం కోసం పిఠాపురం కోర్టు పరిధిలో ఐదుగురు న్యాయవాదులను నియమించామని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమైన కేసులకు లోక్ అదాలత్‌లో మాదిరిగా అవార్డు పాస్ చేసి ఇదే తుది తీర్పుగా పరిగణిస్తామన్నారు. కక్షిదారులు తమ కేసుల మధ్యవర్తిత్వం కోసం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మధ్యవర్తిత్వ వారోత్సవాల పోస్టరును ఆవిష్కరిస్తున్న 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి



లక్ష్మణదొరను అభినందిస్తున్న న్యాయవాదులు

జిల్లా కోర్టు ఏపీపీగా లక్ష్మణదొర

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని 12వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా బత్తిన లక్ష్మణదొర బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీపీని న్యాయవాదులు, పోలీసు అధికారులు కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న దిలీప్‌కుమార్

వృద్ధులకు దుస్తుల పంపిణీ

సర్పవరం జంక్షన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగి ఎం.దిలీప్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్టు కార్యాలయంలో వృద్ధులకు దుస్తులు, స్వీట్లు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. దిలీప్ కుమార్‌ని ట్రస్టు అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో సత్కరించారు. కృష్ణమోహన్, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, ప్రసాద్‌నాయుడు, బి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జీవన రేఖలు'

కథా సంపుటి ఆవిష్కరణ సభ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీభవన్‌లో శనివారం సాయంత్రం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఇంద్రగంటి నరసింహమూర్తి రచించిన జీవనరేఖలు కథా సంపుటి ఆవిష్కరణ, పరిచయసభ జరుగుతుందని సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి తెలిపారు. అనంతరం జరిగే కవి సమ్మేళనంలో కవులు తమకు నచ్చిన ఏదైనా సామాజిక అంశంపై కవిత చెప్పాలని కోరారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

జీజీహెచ్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్‌లో పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉద్యోగులను కఠినంగా శిక్షించాలని జీజీహెచ్ ప్రాంగణంలోని తల్లి-బిడ్డ విగ్రహం వద్ద సీఐటీయూ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా కన్వీనర్ జి.బేబీరాణి మాట్లాడుతూ ల్యాబ్ అటెండెంట్ కళ్యాణచక్రవర్తి, అతని టీమ్‌ను పూర్తిగా తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చంద్రమళ్ల పద్మ, జి.రామలక్ష్మి, సీహెచ్ వేణు, ఎం. నాగలక్ష్మి, జె.లక్ష్మీప్రియ, దడాల పుష్పరాగం, పద్మ, రాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబు పాల్గొన్నారు.

చెరువు పూడికతీత పనులు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఎర్రబంద చెరువులో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం వీటిని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. చెరువు నీటి సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికలకు సన్నాహంలో భాగంగా బూత్ స్థాయి అధికారులుగా ఎంపికైన సచివాలయ, రెవెన్యూ, ఇతర సిబ్బందికి కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో కమిషనర్ భావన, కాకినాడ అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర, డిప్యూటీ తహసీల్దారు కె.గోవిందరాజు గురువారం శిక్షణ ఇచ్చారు. కమిషనరు భావన, తహసీల్దారు జితేంద్ర మాట్లాడుతూ ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, ఓటరు జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారుల పాత్ర ఎంతో కీలకమని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. కేటాయించిన పోలింగ్ కేంద్రం పరిధిలోని అన్ని ఇళ్లను సర్వే చేసి కొత్త ఓటర్లను నమోదు చేయాలని, ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. అన్ని రకాల విషయాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫారం 6, 6(ఎ), 7, 8, అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సంస్కరణలపై రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బీఎల్‌వోలకు తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. బాధ్యతలు, ఓటరు నమోదు, సవరణ, వలస ఓటర్ల సమాచారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దారు టి.కాంతారావు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన విద్యార్థినులతో ఏఎస్‌డీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఏఎస్‌డీ కళాశాలలో జాబ్ డ్రైవ్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం ఏఎస్‌డీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కాకినాడ ధరిత్రి అడ్వజరీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ టెలీకాలర్ ఉద్యోగాల కోసం శుక్రవారం నిర్వహించిన జాబ్ డ్రైవ్ విజయవంతమైందని ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి తెలిపారు. 18 మంది విద్యార్థులు హాజరు కాగా ఎనిమిది మంది ఎంపికయ్యారు. సంజోత, వసంతలక్ష్మి, ప్రత్యూష, రమణ, ఉమాశంకర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై ప్రచారం

గొల్లప్రోలు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం సాగించాలని, ఇందుకు గ్రామాలు, పట్టణాల్లో బాలల స్నేహపూరిత కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు సూచించారు. గ్రామ స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులు, సిబ్బందికి గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ప్రతి మొదటి, మూడవ శుక్రవారాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి అధ్యక్షతన జరిగిన శిక్షణలో జిల్లా బాలల సంరక్షణ అధికారి విజయ, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మానసాదేవి, దేవకుమారి, ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే వనమాడి

కాకినాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాల పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల కేసులో నిందితులను విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. విద్యా సంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినచర్యలు చేపడుతున్నారన్నారు.

ఆలయ భూముల్లో శ్మశానవాటికల ఏర్పాటుపై అభ్యంతరం

పిఠాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయ భూముల్లో ఇతర మతాలకు చెందిన శ్మశానవాటికలు ఏర్పాటు చేసే ప్రయత్నాలపై విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, సురేంద్రదత్తు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానానికి చెందిన నవఖండ్రవాడలోని నక్కులమ్మ చెరువు గట్లపై కొన్ని సమాధులు నిర్మించారని తెలిపారు. ఇప్పుడు ఏకంగా శ్మశానవాటిక నిర్మాణానికి పనులు చేపట్టారన్నారు. ఈ విషయమై కుంతీమాధవస్వామి దేవస్థానం ఈవో, పిఠాపురం తహసీల్దారులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. చెరువు భూమిని, కుంతీమాధవస్వామి ఆస్తులను పరిరక్షించాలని కోరారు.

దేవదాయ భూములు స్వాధీనం

సామర్లకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయినపూడి గ్రామంలో కాకినాడ బొగ్గవరపు వారి సత్రానికి చెందిన 2.39 ఎకరాల పంట భూమిని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సదరు భూమిని కార్యనిర్వహణాధికారికి అప్పగిస్తూ అక్కడ హెచ్చరిక బోర్డులు ప్రదర్శించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, ఈవో జి.శివబాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వి.ఫణికుమార్, బళ్ల నీలకంఠం, ఎం.వీరభద్రరావు, కె.వేణు, వీఆర్వో సంజీవ్, వీఎస్ జగన్నాథ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు తాగునీరు సరఫరా

కొత్తపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కొత్తపల్లి మండలానికి తాగునీరు బంద్ శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేశారు.

రైతు బజారుకు నేడు సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ డిపో సమీపంలో గల రైతు బజారుకు చెందిన రైతు ఓదూరు ఏసుబాబు మృతి చెందాడు. దీంతో శనివారం రైతు బజారుకు సెలవు ప్రకటించినట్టు ఎస్టేట్ ఆఫీసర్లు కృష్ణారావు, గోవిందరాజు తెలిపారు. రైతు బజారు రైతులంతా సహకరించాలని కోరారు.



కనకదుర్గమ్మకు శాకంబరీ అలంకారం

గొల్లప్రోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు కరణంగారి తోటలో కొలువైన కనకదుర్గమ్మను శుక్రవారం 1,100 కిలోల పండ్లు, కాయగూరలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయం హరితవర్ణంతో శోభిల్లింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గరగ తాతాజీ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న దాతలు, ప్రజాప్రతినిధులు

విరవాడలో బస్ షెల్టర్

పిఠాపురం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం విరవాడలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చారు. కూరాకుల చక్రం-సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు రాంబాబు, కుటుంబసభ్యుల సహకారంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను మాజీ సర్పంచ్ గట్టెం రామ్మోహనరావు ప్రారంభించారు. దాతలను గ్రామస్తులు సత్కరించారు.

ఆరు రోజులు సర్వే శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ప్లానింగ్, అడ్మిన్, రెవెన్యూ, ఇంజనీరింగ్ సెక్రటరీలకు ఆరు రోజుల పాటు నక్ష సర్వే శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు సిటీ డిప్యూటీ ప్లానర్ కృష్ణారావు గురువారం తెలిపారు. నక్ష హెడ్ ఆఫీస్ నుంచి, సర్వే డిపార్టుమెంట్ నుంచి శిక్షకులు వచ్చి 40 టీమ్‌లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ ఇస్తారు.

స్కూలు బస్సుల తనిఖీ

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని ప్రైవేటు స్కూల్స్, కళాశాలలకు చెందిన బస్సులు, వ్యాన్లు, ఆటోలు, ఇతర వాహనాలను పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. వాటి ఫిట్నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు, వాహన డ్రైవర్ల లైసెన్సు పరిశీలించారు. ఏ పత్రాలు లేకున్నా, గడువు ముగిసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులను ఎక్కించుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తనిఖీల్లో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా దినోత్సవ ర్యాలీ

గొల్లప్రోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలులో వైద్యులు, సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అమృతరావు, హెచ్‌వీ లక్ష్మీరమణ, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఏఎన్ఎం చిన్ని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

జనసేన ఆధ్వర్యంలో వైద్య శిబిరం

తునిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తుని ఉప్పరగూడెంలో జనసేన నాయకులు వేగిశెట్టి రమణ, కంకిపాటి శివ, గిరిస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 80మందికి నేత్ర, దంత, జనరల్ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. నాయకులు బోనం చినబాబు, దండెం రామకృష్ణ, పలివెల లోవరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వరదలపై అప్రమత్తంగా ఉండండి : పీవో



వరద పరిస్థితిపై సమీక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి పెరుగుతోన్న క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశించారు. శుక్రవారం వరద స్థితిపై చేపట్టాల్సిన చర్యలపై పీవో సమీక్షించారు. సీడబ్ల్యూసీ అందించిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి 7 గంటలకు భద్రాచలంలో గోదావరి 37.60అడుగులకు చేరుకుందన్నారు. శనివారం ఉదయానికి 40అడుగులకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈపరిస్థితి ఆదివారం వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి ప్రాథమిక వైద్య శాలలో జనరేటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. దోమ తెరలు, బరకాలు సిద్ధం చేయాలన్నారు. చింతూరు డివిజన్ వ్యాప్తంగా 440మంది గర్భిణీలు ఉన్నందున వారిని ముందస్తుగానే ఆసుపత్రులకు తరలించాలన్నారు. పునరావాస ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు, ఆసుపత్రుల్లో అదనపు బెడ్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా ఎప్పటికపుడు ప్రజలకు వరద పరిస్థితిపై సమాచారం చేరవేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాగులకు పోటెత్తిన గోదావరి వరద

భద్రాచలం వద్ద 37.60 అడుగులు

ఎటపాక, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో గోదావరి నదికి వరదపోటు తగులుతోంది. రెండు రోజులుగా గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం 37.6అడుగులుగా నమోదైంది. నెమ్మది వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ఎటపాక మండలంలోని పలు వాగుల్లోకి వరదనీరు పోటెత్తింది. తోటపల్లి, నందిగామ, మురుమూరు, రాయనపేట తదితర వాగుల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. గోదావరి వరద 40అడుగుల వరకు చేరుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. మరోవైపు వరద పెరుగుతోన్న నేపథ్యంలో ఏజెన్సీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా గోదావరి, శబరి

కూనవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద పెరిగితే లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారం రాత్రి 7గంటలకు కూనవరం వద్ద 26అడుగులతో గోదావరి, శబరి నదులు ప్రవహిస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు అడుగులు వరద పెరిగింది. దీంతో టేకులబోరు-కొండ్రాజుపేట రోడ్డుపై వరదనీరు చేరింది. ఈ రోడ్డుపై నీరు చేరడంతో వేరే మార్గంలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు వరద ఉధృతం కావడంతో అధికారులు లాంచీలను సిద్ధం చేశారు. తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ లతశ్రీ వరద ఉధృతిని పరిశీలించారు.

'నత్తనడకన పరిహారం లెక్కలు'

చింతూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం లెక్కల నమోదు నత్తనడకన నడుస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చింతూరులో మర్లపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుపట్టారు. ప్రతి ముంపు గ్రామాన్ని పరిగణనలోకి తీసుకుని అన్నిగ్రామాలకు ఏకకాలంలో పరిహారం చెల్లించాలన్నారు. మేకల నాగేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాధం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు అశోక్, కారం లక్ష్మి, సోయం చినబాబు, పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేపట్టాలి

చింతూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లోని పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల బదిలీల విషయంలో అవకతవకలు జరిగాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను శుక్రవారం ఒక ప్రకటన ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలు అనుసరించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు చేపట్టాలన్నారు. ఒక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో బదిలీలు జరగడం తగదన్నారు.

మొక్కలు నాటిన సీఆర్పీఎఫ్ సిబ్బంది

మోతుగూడెం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో శుక్రవారం లోయర్ సీలేరు ఏపీ జెన్కో క్రికెట్ మైదానం ప్రక్కన సీఆర్పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రకాష్, ఇన్‌స్పెక్టర్ దినేష్ సహానా ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. మోతుగూడెం చుట్టుప్రక్కల వెయ్యి మొక్కలు నాటారని కమాం డెంట్ ధర్మప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్‌పై దృష్టి పెట్టాలి

వై.రామవరం, జూలై11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని ఎంపీడీవో బాపన్నదొర సిబ్బందిని ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దాలిపాడు, చవిటిదిబ్బలు తదితర పంచాయతీల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యదర్శులు, సచివాలయ పాల్గొన్నారు.

తాగునీటికి ఇక్కట్లు

దేవీపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల నుంచి సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు నిరసన తెలియజేయడంతో మండలంలో 20 గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో 18 నెలలకు కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో నిరసన తెలియజేస్తున్నారు. అధికారులు స్పందించి బకాయి జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించి సమస్య పరిష్కరించి తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి

రాజవొమ్మంగి జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ కల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగిలో టీడీపీ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నిక సోమవారం జరగనుందన్నారు. స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో ఏజెన్సీలోని అన్నిగ్రామాల్లో టీడీపీ నిలబెట్టిన అభ్యర్థులే విజయంసాధించేలా టీడీపీ మండల అబ్జర్వర్ అప్పన రమేష్, టీడీపీ నాయకులు దంతులూరి శివరామ చంద్రరాజు, గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, ఎంపీటీసీ నల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

కొమరం భీమ్ విగ్రహం ధ్వంసం

కూనవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. కోతులగుట్టలో సచివాలయానికి ఎదురుగా ఉన్న విగ్రహంపై దాడి చేయడంతో గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. అదేరోజు జగ్గవరం క్రాస్‌రోడ్డు దగ్గర ఉన్న దిమ్మపై ఆదివాసీల జెండాను సైతం పీకి పారేశారని ఆ సంఘానికి చెందిన నాయకులు కుంజ అనిల్ తెలిపారు. కొంతమంది కావాలని ఈఅల్లర్లు సృష్టిస్తున్నారని వెంటనే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రంపచోడవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ వైద్యాధికారులు పనివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు పగడ్బందీగా నిర్వహించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. శుక్రవారం స్థానిక క్యాంపు ఆయన ప్రజా దర్బార్ నిర్వహించగా పలువురు వినతిపత్రాలు సమర్పించారు. తక్షణం సంబంధిత అధికారులకు సమస్య తెలిపి సత్వరమే పరిష్కారం ఇవ్వాలని ఆదేశించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామాల్లో మౌలిక వసతుల అవసరాలపై ప్రజలు ప్రజా దర్బార్లో తెలియజేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సరఫరా వంటి ప్రజా అవసరాలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ, రేఖ బుల్లిరాజు, మండపాక అప్పన్నదొర, బద్ది సురేష్, యల్లపు దొరబాబు, బత్తుల వెంకన్న, షేక్ వల్లి ఉన్నారు.



జగ్గంపేటలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గండేపల్లిలో 'తొలి అడుగు'

గండేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం గండేపల్లిలో ఎమ్మెల్యే నెహ్రూ స్థానిక నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. శెట్టిబలిజిపేట కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, కంటిపూడి సత్యనారాయణ, బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశి, కంటిపూడి రామారావు, వెంపాటి రాజు, సుంకవిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో యనమల కుటుంబం



తిరుమలలో మాజీ మంత్రి యనమల కుటుంబీకులు

తునిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు, ఐఆర్ఎస్ అధికారి గోపినాథ్, ఎమ్మెల్యే దివ్య దంపతులు శుక్రవారం తిరుమల వెంకన్నసేవలో తరించారు. కుటుంబ సభ్యులతో కలిసి వారు తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

అనుమతి లేని లేఅవుట్‌కు నోటీసులు

రౌతులపూడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాజవరం గ్రామశివారు రహదారిని అనుకుని అనుమతులు లేకుండా ఎకరం యాభై సెంట్లు భూమిలో ఇళ్ల స్థలాలు లేఅవుట్‌ను గంగవరం వైసీపీకి చెందిన ముగ్గురు వ్యక్తులు వేశారు. గత 5 నెలలుగా ఈ పనులు జరుగుతున్నాయి. దీంతో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి రెవెన్యూ, పంచాయితీ అధికారులను అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించడంతో అనుమతి లేని ఆ లేఅవుట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ఏలేశ్వరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ టీవీ రావు నేతృత్వంలో కార్మికులు పాల్గొని యూనియన్ జెండా ఆవిష్కరించారు. డిపో అధ్యక్షుడు నానిబాబు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్.కృష్ణ, ఎస్వీ రావు, యూటీఎం కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు మొట్టమొదటి వేతన సవరణ ఒప్పందాన్ని తీసుకువచ్చిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'లోవ'లో ఆషాఢ మాసోత్సవాలు

తునిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి సన్నిధికి వేలాది మంది భక్తులు తరలివచ్చి సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించారు. తరలివచ్చిన భక్తులకు ఆలయ ఈవో విశ్వనాధరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అమ్మవారి మహాప్రసాదాన్ని అందజేశారు.



సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న భక్తులు

'కూటమి పాలనలో గ్రామాలు అభివృద్ధి'

ప్రత్తిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో గ్రామాలు సర్వతో ముఖాభివృద్ధి చెందుతున్నాయని టీడీపీ కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీనియర్ నాయకులు పంచాది వీరబాబు, అమరాది వెంకట్రావు, తటవర్తి సుబ్బారావు చెప్పారు. మండలంలోని పోతులూరులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వ విజయాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పక్కా సిమ్మెంటు రహదారులు, ప్రధాన రహదారులు, తాగునీటి వనరులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రూ.కోట్లు వ్యయం చేసి అభివృద్ధి పరిచిందని తెలిపారు. కార్యక్రమంలో వాకపల్లి సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, పోతులూరు మాజీ ఎంపీటీసీ నాగులాపల్లి బాబ్జి, బొండు చంటబ్బాయి, ఉపసర్పంచ్ బర్ల చక్రం, నాయకులు గింజాల వీరబాబు, నాగులాపల్లి రాంబాబు, సిద్దా దొరబాబు, శెట్టి బాబురావు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: పోతులూరులో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పద్మనాభనగర్‌లో 'తొలి అడుగు'

జగ్గంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పద్మనాభనగర్‌లో కూటమి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. 14,15 వార్డుల్లో సొసైటీ డైరెక్టర్ నండ్ల చిరంజీవి సత్తిబాబు, జనపరెడ్డి వీరబాబు, కార్యకర్తలు అభివృద్ధిపై ప్రజలకు వివరించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రత్తిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. మండల వైద్యాధికారి గీత మాట్లాడుతూ ప్రణాళికా బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమాల్లో ఆసుపత్రి సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

కిర్లంపూడి: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భాదారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్యోతి, పీహెచ్ఎన్ అన్నపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్స్ రమణమూర్తి, అనంతలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కిర్లంపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రహదారుల నిర్మాణాలపై అవగాహన



ఏలేశ్వరంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ రహదారుల నిర్మాణాలపై అవగాహన సదస్సు చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కాకినాడ ఉప ప్రణాళిక అధికారి సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2026 ఆర్థిక సంవత్సరం నుంచి 2046 ఆర్థిక సంవత్సరాలకు డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని తిరుమలి, లింగంపర్తి, సిరామవరం, ఏలేశ్వరం మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీనికి గాను రోడ్ల నిర్మాణం ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అభ్యంతరాలు ఏమైనా ఉంటే సంబంధిత రైతులు తమకు తెలలియపరచాలన్నారు. రానున్న పది సంవత్సరాల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. రోడ్ల విస్తరణలో ఆయా భూములకు సంబంధించిన రైతుల నుంచి అభ్యంతరాలు ఉంటే కార్యాలయం పని వేళల్లో తెలియజేయాలన్నారు. ప్రజాప్రతినిధులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్‌బాబు, మసురుకు నాగేశ్వరరావు, నగర్ కమిషనర్ ఎం.సత్యనారాయణ, సహాయ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, జూనియన్ ప్లానింగ్ అధికారి శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి జెడి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం



కిర్లంపూడిలో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తుమ్మలపల్లి రమేష్, అధికారులు

కిర్లంపూడి, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన ఆర్వో ప్లాంట్‌ను నిర్మించారు. శుక్రవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో జోసెఫ్, కళాశాల ప్రిన్సిపాల్ విమల, ఎంపీటీసీ అల్లు శివరామకృష్ణ, గోకాడ రాజా, ఎల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, బొండా వెంకటరమణ, బొండా నందిబాబు తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్సీ బొత్స రాక

ప్రత్తిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ హాజరవుతున్నట్టు నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం తెలిపారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్వగృహం వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ నేతలు హాజరవుతున్నట్టు గిరిబాబు తెలిపారు. నియోజకవర్గ వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

'రిలే నిరాహార దీక్షలు చేస్తా'

శంఖవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పైడిపాల నుంచి కత్తిపూడి వరకూ భారీ వాహనాలు సృష్టిస్తున్న విధ్వంసాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని, భారీ వాహనాలను నిలుపుదల చేసేవరకూ పోరాటం చేస్తానని జనసేన నేత మేకల కృష్ణ తెలిపారు. దీనిపై ఇదివరకే అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని, భారీ వాహనాల రాకపోకలతో విద్యార్థులు, ప్రజలు అవస్థలకు గురవుతున్నారన్నారు. ఈ నెల 21 నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తానని, పట్టించుకోకపోతే ఈ నెల 25 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వాహనలకు ప్రత్యేకరోడ్లను నిర్మించాలని, ఉద్య మానికి ప్రజలందరి మద్దతూ ఉండాలని కోరారు.

విశ్రాంత ఎంఈవోకు సన్మానం

ప్రత్తిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడుకు చెందిన విశ్రాంత ఎంఈవో ముక్కు సుబ్రహ్మణ్యంను శుక్రవారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సన్మానించారు. రాచపల్లి రమణాశ్రమంలో విశ్రాంత ఎంఈవో భరతమాత విగ్రహం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన సేవను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా వీరబాబు, నాయకులు నానిపల్లి శ్రీనివాస్, రామకుర్తి సూర్యనారాయణ, పడారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో ప్రారంభించారు. అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు అనంతరం 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు.

'ఆదిత్య' విద్యార్థుల విజిట్ కార్యక్రమం



రాజమండ్రిలో విజిట్‌కు హాజరైన విద్యార్థులు

గండేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ అధ్యయన పరిశ్రమ పరస్పర సంబంధ కార్యక్రమం కింద సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(ఇండియా) రాజమహేంద్రవరం సెంటర్ సంయుక్తంగా డైనమిక్ ఫైల్ లోడ్ టెస్ట్ లైవ్ డెమో ఫీల్డ్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, డాక్టర్ టి.జ్ఞానానందరావు పాల్గొని ప్రాజెక్టు సైట్‌లో 200టన్నుల డైనమిక్ లోడ్ టెస్టును ప్రత్యక్షంగా వీక్షించారు. గోదావరి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి ప్రాజెక్టుకు సంబంధించిన ఈటెస్టును ఐఆర్‌సీ 78, ఏఎస్‌టీఎండీ 4945ప్రమాణాల ప్రకారం నిర్వహించారు. డాక్టర్ కేవీ నరసింహరావు ప్రాథమిక ఫైల్‌లోడ్‌టెస్ట్ అవసరం, విధానం, ప్రయోజనాలపై వివరించారు. తర్వాతడెమో నిర్వహించారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

యూనివర్శిటీలో జేఎన్‌టీయూకే, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సంయుక్తంగా ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా నిర్వహించినట్టు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, జేఎన్‌టీయూకే ఫార్మసీ హెడ్ డాక్టర్ బి.భవాని తెలిపారు. ఈనెల7 నుంచి 11 వరకు రీసెంట్ అడ్వాన్స్ అండ్ ఫ్యూచర్ పర్స్‌పెక్టివ్ ఇన్ ఫార్మకోగ్నోసి అనే అంశంపై ప్రతీ రోజు నాలుగు సెషన్స్ నిర్వహించామన్నారు.

'స్థాయిని మరచి మాట్లాడుతున్న వైసీపీ నేతలు'

జగ్గంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు తమ స్థాయిని మరచి మాట్లాడుతున్నారని మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోదిరెడ్ల సుబ్బారావు అన్నారు. జగ్గంపేటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ మండల అధ్యక్షుడు రావులగణేష్ రాజా స్థాయికి మించి మాట్లాడుతున్నారన్నారు. రాజా స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందిస్తుందన్నారు. గత ప్రభుత్వంలా ఇసుక మొత్తం వైసీపీ కార్యకర్తల్లా దోచుకుతినడం లేదన్నారు. ఇల్లు కట్టుకుంటే ఉచితంగా సామాన్యుడికి ఇసుకందించే ప్రభుత్వం తమదన్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు గండే కాశీ, సుమన్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ వల్లి, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్, వీరబత్తుల జగన్ పాల్గొన్నారు.

ఆకతాయిలపై పోలీసుల నిఘా నేత్రం

జగ్గంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): బస్టాండ్ వద్ద, బాలికల ఉన్నత పాఠశాల వద్ద ముఖ్య సమయాల్లో డ్రోన్ కెమెరాలు ఉపయోగించి ఆకతాయిలను గుర్తించి, వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే బాలికలకు రక్షణ కల్పిస్తున్నారు. శుక్రవారం డ్రోన్ కెమెరాల ద్వారా అక్కడి పరిస్థితులను జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ పరిశీలించారు. ఎస్ఐ రఘునాధరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే చర్యలు



కిర్లంపూడి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం జగపతినగరంలో ఉన్న ప్రగతి స్కూల్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్సు, వాహనపత్రాలు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను డ్రైవర్ పక్కన, చెక్కలపై, వెనుక వైపు కూర్చోపెట్టరాదన్నారు. విద్యార్థులను చేరవేసే ఆటోడ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

'బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే చర్యలు'

జగ్గంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలకు సమీపంలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ఎస్ఐలు విస్తృతంగా తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న వారిని, మైనర్లకు సిగరెట్లు, ఇతరపొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న వారిని గుర్తించారన్నారు. జగ్గంపేటలో 15మంది, గండేపల్లిలో 15మంది, కిర్లంపూడిలో 12మంది మొత్తం 47మందిపై కేసులు నమోదు చేసి రూ.9400 జరిమానా విధించామని సీఐ తెలిపారు.

గొయ్యిని పూడ్చిన అధికారులు

ఎటపాక, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎటపాక పోలీస్ స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి కుంగి పడిన గొయ్యిని తెలంగాణ ఆర్అండ్‌బీ అధికారులు శుక్రవారం పూడ్చారు. భద్రాచలం- చర్ల రోడ్ ఏపీలోని ఎటపాక వద్ద గురువారం రహదారి కుంగి ఐదడుగుల గొయ్యి పడిన విషయం తెలిసిందే. శుక్రవారం భద్రాద్రి కలెక్టర్ ఆదేశాలతో తెలంగాణ ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రొక్లైనర్‌తో కుంగిన రహదారికి మరమ్మతులు చేపట్టారు. సిమెంటు పైపులు రెండు అమర్చి గొయ్యిని మట్టితో పూడ్చారు.